క్లుప్తంగా

నేడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాంరెడ్డి

హయత్‌నగర్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మునుగనూరులో నూతనంగా నిర్మించే శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే రంగారెడ్డి పరిశీలించారు. భక్తులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న దేవాలయ నిర్మాణం పనులు ప్రారంభం కానున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ మండల స్థాయి సమావేశం

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ ఇబ్రహీంపట్నం మండల విస్తృతస్థాయి సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక శాస్త్ర గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ స్టూడెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. బీఆర్‌ఎస్ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

నిధుల మంజూరు

మాడ్గుల: మండలంలోని 22 గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులకు పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖల ద్వారా రూ.2.25 కోట్ల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి తెలిపారు. మండలంలోని శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలో గ్రామాలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిధులు మంజూరు చేశారని చెప్పారు.

ప్రభుత్వ భూములు కాపాడాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నల్లచెరువు గ్రామస్తులు

మాడ్గుల: మండలంలోని విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని నల్లచెరువు గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 99 భూమిని ఆక్రమణకు గురవుతుందన్నారు. అధికారులు దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు కబ్జాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



ఆమనగల్లు: మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌ను బీఆర్‌ఎస్ నాయకులు సత్కరించారు. ఆమనగల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ శంకర్‌నాయక్‌ను నాయకులు వెంకటయ్య, జయరాంనాయక్‌లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సీఐ ప్రమోద్‌కుమార్



ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

ఆమనగల్లు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఎస్‌ఐ వెంకటేశ్‌తో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. సీఐ మాట్లాడుతూ.. వాహనాలు నడిపేవారు విధిగా లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన కోరారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ముస్తాబైన చర్చి

- బాలఏసు మహోత్సవానికి సర్వం సిద్ధం
- నేడు, రేపు ప్రత్యేక కార్యక్రమాలు
- పెద్ద ఎత్తున తరలి రానున్న భక్తులు



విద్యుత్ దీపాలతో వెలుగుతున్న బాలఏసు పుణ్యక్షేత్రం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని బాలఏసు పుణ్యక్షేత్రం వార్షిక మహోత్సవానికి ముస్తాబైంది. ఏటా ఫిబ్రవరి నెల 2వ వారంలో బాలఏసు మహోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగానే ఈ నెల 8, 9 తేదీల్లో ఉత్సవాలను నిర్వహించనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ నుంచి భక్తులు హాజరై బాలఏసును దర్శించుకోనున్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చర్చి కమిటీ సభ్యులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించనున్నారు. వనస్థలిపురం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

శనివారం ప్రత్యేకం

ఉదయం 7 గంటలకు ఫా.గ్రాబ్రియేల్ ఫలవంతమైన జీవితం జీవించటం అనే అంశంపై తెలుగులో దివ్య బలిపూజ, సాయంత్రం 5 గంటలకు ఫా.గోవిందు ఆరోగ్య స్వామిచే క్రీస్తు సువార్త కోసం నిబద్ధత అనే అంశంపై ఆరాధన, వ్యాక్య పరిచర్య, దివ్య బలిపూజ నిర్వహించనున్నారు.

కార్డినల్ పూల ఆంథోని రాక

మహోత్సవాల్లో కీలకమైన ఆదివారం ఉదయం 4 గంటల నుంచే ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. 4 గంటలకు ఫా.తాతిరెడ్డి జయరాజ్, విచారణ గురువు, యంజాల తెలుగులో దివ్య బలిపూజ, ఫా.మాదాసు ఆరోగ్య స్వామి, సహ గురువు యంజాల, దివ్యబలిపూజ నిర్వహించనున్నారు. ఫా.విక్టర్ ఇమ్మానుయేల్ ఉదయం 6 గంటలకు ఇంగ్లిష్‌లో దివ్య బలిపూజ, ఉదయం 8 గంటలకు తమిళంలో ఫా.రెక్స్ ఏంజెలో ఎస్‌జే, ఉదయం 9.30 గంటలకు బాలఏసు మహోత్సవ దివ్య బలిపూజ ఆంగ్లంలో ఎంఎస్‌జీఆర్. ఏరువా బాలశౌరి నిర్వహించనున్నారు. ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ అతి మేత్రాణులు కార్డినల్ పూల ఆంథోని హాజరుకానున్నారు. ఆయన బాలఏసు మహోత్సవ దివ్య బలిపూజను తెలుగులో నిర్వహించనున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఇన్‌ఫాంట్ జీసస్ స్పెషల్ పేరుతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. మహాత్మాగాంధీ బస్ డిపో, మెహిదీపట్నం, నాంపల్లి, కోఠి, నల్గొండ ఎక్స్ రోడ్ నుంచి 277 నంబర్ బస్సులు, కోఠి, దిల్‌సుఖ్‌నగర్ నుంచి 277డి, 102 నంబర్, జూబ్లీ బస్‌స్టేషన్, సికింద్రాబాద్ నుంచి 279 నంబర్ బస్సులను తుర్కయంజాల్ వరకు నడపనున్నారు. క్యాథలిక్ హబ్, దివ్య వాణి టీవీలలో మహోత్సవాలను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.

నేపథ్యం ఇదీ

దేశంలో ఏర్పాటు చేసిన బాలఏసు పుణ్యక్షేత్రాల్లో ఇది మూడోది. బయట నుంచి చూస్తే మత్స్య ఆకారంలో కనిపిస్తుంది. భక్తుల రద్దీ దృష్ట్యా 1992లో ఆలయ విస్తరణను చేపట్టారు. రెండు గాలిగోపురాల మధ్య సింహద్వారం ఉంటుంది. వీటికి 150 కిలోల కంచు గంటను అమర్చారు. భారతీయ కళా సంపద ఉట్టి పడే విధంగా 70 అడుగల ఎత్తులో ఒక గుహగోపురం తీర్చిదిద్దారు. ఏటా 50 వేలకు పైగా భక్తులు ఈ ఉత్సవాలకు హాజరవుతుండటం విశేషం.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- 10న శ్రీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం
- భారీ ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ



శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయం

ఆమనగల్లు: కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం నుంచి 14 వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే బ్రహ్మోత్సవాల కోసం ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా ఏడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వస్తి పుణ్యహావాచనం, విశ్వక్‌సేనపూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ, 9న అమ్మవారికి ప్రత్యేకపూజలు, లలితా సహస్రనామ పారాయణం, స్వామివారి ఎదుర్కోలు, 10న స్వామివారి కల్యాణోత్సవం, తెల్లవారుజామున అగ్నిగుండాలు, 11న స్వామివారికి లక్ష పుష్పార్చన, ప్రత్యేక పూజలు, విష్ణుసహస్రనామ పారాయణం, పుష్పమాలసేవ, చిన్న రథోత్సవం, 12న సామూహిక కుంకుమార్చన, సహస్రనామ పారాయణం, పెద్ద రథోత్సవం, 13న ఆకుపూజలు, హనుమాన్‌చాలీసా పారాయణం, దోపోత్సవం, 14న అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, చక్రతీర్థం, గరుడసేవ ఊరేగింపు, నాగవల్లి నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల కోసం ప్రధాన రహదారిపై ఉన్న ముఖద్వారానికి రంగులువేసి విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఉత్సవాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆయన అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు.



మూలవిరాట్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న చెన్నకిషన్‌రెడ్డి

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలి

ఆమనగల్లు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి సూచించారు. ప్రతి విద్యార్థి కలలు కని సాకారానికి కృషి చేయాలని ఆయన కోరారు. కడ్తాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు చెన్నకిషన్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన విద్య ప్రతి ఒక్కరిని ఉన్నతస్థితికి చేరుస్తుందన్నారు. విద్యార్థులకు రూ.15 వేలతో స్టడీ మెటీరియల్ సమకూర్చిన వెంకటేశ్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి మహేశ్, కోశాధికారి నర్సింహా, పీఆర్‌టీ పాషా, నాయకులు హన్మానాయక్, బిచ్యానాయక్, శ్రీనివాస్, వెంకటేశ్, లక్ష్మయ్య, సత్యం, జహంగీర్, రమేశ్, తరుణ్, శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రజాక్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 10న ప్రజాసంఘాలు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఆమనగల్లు సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య తెలిపారు. కడ్తాల మండల కేంద్రంలో శుక్రవారం ప్రజాసంఘాల మహాధర్నా కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజలకు వ్యతిరేకంగా ఉందన్నారు. బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉందని ఆయన విమర్శించారు. బడా బాబుల బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈనెల 10న నిర్వహించే మహాధర్నాకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు లక్ష్మమ్మ, వరలక్ష్మి, సబిత, రమేశ్, మల్లేశ్, శ్రీను, మోహన్, శేఖర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ కన్వీనర్ పెంటయ్య

కడ్తాల్ అభివృద్ధికి రూ.1.30 కోట్లు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: కడ్తాల మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.1.30 కోట్లు మంజూరు చేసిందని డీసీసీ అధికార ప్రతినిధి గూడురు శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నిధులు మంజూరైనట్లు ఆయన చెప్పారు. మండల కేంద్రంలో శుక్రవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడ్తాల పరిధిలోని వివిధ గ్రామాలకు సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు నిర్మించనున్నట్లు చెప్పారు. వీలైనంత త్వరలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు బాలరాజు, యాదగిరిరెడ్డి, జహంగీర్‌అలీ, సత్యం యాదవ్, క్యామరాజేశ్, రవి, శ్రీకాంత్, రమేశ్ నాయక్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీధి నాటకం

ఆమనగల్లు: మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం ఆకట్టుకుంది. శుక్రవారం బ్రహ్మంగారిగా యాదయ్య, గోవిందమ్మగా వెంకటాచారి, బాలబ్రహ్మంగారిగా చంద్రమౌళి, అచ్చమ్మగా లక్ష్మయ్య, సిద్ధప్పగా శ్రీనులు నాటకంలో పాత్రదారులుగా వేశారు. ఈ సందర్భంగా కళాకారులకు ప్రోత్సాహకరంగా మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావు రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, జంగయ్య, కేశయ్య, మైసయ్య, వెంకటయ్య, శ్రీను, జంగయ్య, అఖిలాష్ తదితరులు పాల్గొన్నారు.



శెట్టిపల్లిలో కళాకారుల వీధి నాటకం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ చేపట్టిన సందర్భంగా సంబురాలు

షాద్‌నగర్‌రూరల్/కొత్తూరు/కొందుర్గు: పల్లెల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన చేపట్టిన సందర్భంగా శుక్రవారం షాద్‌నగర్ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తొలుత ఫరూఖ్‌నగర్ మండల నాగులపల్లి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ హాజరై గ్రామ ముఖ్య కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ నుంచి నాగులపల్లి మీదుగా ఈదులపల్లికి రూ.1.70 కోట్లతో బీటీ రోడ్డు, నాగులపల్లి నుంచి రాసుమల్లగూడ వరకు రూ.60 లక్షలతో బీటీ రోడ్డు, హరిజనవాడలో రూ.7లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై ఆమోదం తెలపడం రాష్ట్ర చరిత్రలోనే మర్చిపోలేనిదన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించారన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలో నిర్వహించిన సంబరాల్లో ఎమ్మెల్యే శంకర్ పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొందుర్గు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు డప్పులతో స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

గ్రామాభివృద్ధికి నిధుల మంజూరు

ఆమనగల్లు: మండలంలోని మంగళపల్లి గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.10 లక్షలు మంజూరైనట్లు మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి తెలిపారు. గ్రామంలో శుక్రవారం వివిధ కాలనీలలో ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.10 లక్షలు మంజూరు చేసిందన్నారు. మంజూరైన నిధులతో ఎస్‌సీ కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జంగయ్య, నాయకులు నారాయణరెడ్డి, మల్లయ్య, కృష్ణయ్య, పెద్దయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి సేవలు మరువలేనివి



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రమాబాయి అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బుద్ధ చెస్ అకాడమీ అధ్యక్షుడు మీసాల రమేశ్, టీఎస్‌ఎస్ఓ రాష్ట్ర కోఆర్డినేటర్ సుదర్శన్, నాయకులు శివ, బాలు, యాదగిరి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తె మెట్టెల అందజేత

కొత్తూరు: నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువకుడి పెళ్లికి శుక్రవారం బంగారు పుస్తె మెట్టెలను మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎమ్మె సత్యనారాయణ అందజేశారు. గ్రామానికి చెందిన దండు రాములు కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా అతడి కుమారుడు శేఖర్ వివాహ నిమిత్తం వధువుకు పుస్తె మెట్టెలను మాజీ సర్పంచ్ అందించారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, పాండు, కృష్ణయ్య, వెంకటయ్య, తిరుపతయ్య, అంజయ్య పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఆశ్రమ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

ఆమనగల్లు: పట్టణంలోని గిరిజన ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. డీటీడీఓగా నందిని, ఏటీడీఓగా శిరిష, ప్రధానోపాధ్యాయురాలిగా గీతాంజలి, వసతిగృహ అధికారిగా రేణుక, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆశ్రమపాఠశాల సంక్షేమాధికారి గోపాల్, ఉపాధ్యాయులు విమల, జ్యోతి, కవిత, కీర్తి, శాంభవి, పద్మ, సంతోషలక్ష్మి, సునీత, స్వాతి, ఆస్మా తదితరులు పాల్గొన్నారు.

కీచకులపై కఠిన చర్యలు తీసుకోండి

ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు మస్కు అరుణ



ఇబ్రహీంపట్నం రూరల్: మైనర్ బాలికను వేధింపులకు గురి చేస్తున్న కీచకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు మస్కు అరుణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. రోజు రోజుకు విద్యార్థినులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఇటీవల నెల రోజుల్లో మూడు సంఘటనలు ఇబ్రహీంపట్నం పరిధిలో చోటు చేసుకోవడం దారుణమన్నారు. లయోలా ప్రైవేటు పాఠశాలకు చెందిన ప్రిన్స్‌పాల్ దినావన్‌రావును ఉరి తీయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని తెలిపారు. శంషాబాద్‌కు చెందిన ఒకటో తరగతి చిన్నారిపై డ్రైవర్ అసభ్య ప్రవర్తన అందరిని కలిచివేసిందన్నారు. హైదర్షకోటలో మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. జిల్లాలో ఏదో ఒక చోట ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కావడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఐద్వా ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

భూదాన్ భూములకు పట్టాలివ్వాలి

తహసీల్దారుకు బాధితుల వినతి

నందిగామ: నిరుపేదలమైన తమకు అప్పట్లో భూదాన్ బోర్డు ద్వారా కొంత భూమిని ఇచ్చారని, వాటికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని బాధితులు శుక్రవారం తహసీల్దారు రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా భూ బాధితులు మాట్లాడుతూ.. 1975లో భూదాన్ బోర్డు ద్వారా నందిగామలోని సర్వే నంబరు 990లో 18 మంది నిరుపేద దళిత రైతులకు 68 ఎకరాల 22 గుంటల భూమిని దానంగా ఇచ్చారని, ఆ భూమికి సంబంధించి ఓ వ్యక్తి నకిలీ ఓఆర్‌సీ సృష్టించి ఆయన పేరుపై మార్చుకున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఓఆర్సీలను రద్దు చేసి తమ పేరుపై పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, చంద్రయ్య, పోచయ్య, రాములు, పోచమ్మ, భీమయ్య, మల్లేష్, చంద్రశేఖర్, జంగయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న భూ బాధితులు